



# వ్యాధి

వారం రోజులయి, ముసురుపట్టి ప్పుటప్పుట వెలుస్తూందికాని, వర్షం పూర్తిగా తగ్గలేదు.

క్షయరోగం వచ్చిన యమదూతలలా అగపడే నల్లటి క్రఊచలగుండా, నరకంలోనే బందిఖానా ఉంటే, దానికుండే ఒకేఒక కిటికీలా ఉండే, ఆ ఇంటి కిటికీగుండా, రక్తంలేని దేహంనించి ప్రాణంలేని నవ్వులా క్షణంక్రితం విచారంగా మెరిసి మాయమయింది, మిణుకుమిణుకుమని ఒక కాంతిలేని నక్షత్రం. ఎన్నో దినాలయి, ఆహారం లేక ఆర్చుక పోయిన నల్లటి ముసలి మొసలి, నోరు తెరిచినప్పుడు

దూరదూరంగా ఉండే దాని క్రూరమైన కోరలాఉన్న ఆ మునలి చూరుయొక్క పెంకుల సందుగుండా, మొసలికన్నీళ్లలా వర్షపునీరు చెమ్మపట్టిన ఆ గది నేలమీద రాలుతూఉండగా, ఆఖరవబోయే తనని, తన దరిద్రాన్ని, తన కుక్షిలో ఇమిడిఉండే ఒక మానవసంసారపు వేదనని తలచుకొని ఆ ఇల్లు ఏడుస్తున్నట్టుగా ఉంది.

అతడు ఎదిగిన గడ్డంతో,పండిన తలవెంట్రుకలతో, లోతుకు పొచ్చుకపోయిన కళ్లతో, ఎండి వాడిపోయిన ముఖంతో, పీక్కుపోయిన చెక్కిళ్లతో అత్మే జీవంగా కల మానవుడిలా కనిపిస్తూ, తుపానుకి అల్లాడిపోయే ఎండుకొమ్మల్లాంటి చేతులతో తల పాతుకొని, కాటిలో ఆరిపోతున్న చితిలా వెలిగే కిరసిన్‌దీపాన్ని, అందులోనే తన ప్రాణంఅంతా ఇమిడిఉన్నట్టు, అది ఆరిపోతే ప్రాణం పోతుందన్నట్టు చూస్తూ కూర్చున్నాడు, చీలికవాలికలైన పరుపు ఉన్న కుక్కిమంచంమీద.

ఆ చిన్న కిరసిన్ బెడ్‌రూమ్ దీపం గదిలో ఒక మూలకున్న పెంపిరిపట్టిన పాత ట్రంకుపెట్టెమీద ఉంది. ఆ గదిలో ఆ ట్రంకుపెట్టే టేబిలుగా వాడబడుతూంది. దానిమీద ఉన్నాయి ఒకటో తరగతి స్కూలుపుస్తకాలు, అట్టలు ఊడివచ్చి, అరిగి, తరిగి, నలిగిపోయిన అంచులతో, పగిలిపోయిన బలపం, రెండు

---

**దేవుడు! వ్యథాకలితహృదయాలలో ఉద్భవించి, రకరకాల రూపాలను సంతరించుకునే పదం అది. మనిషి బాధలలో, వ్యథలలో ఉన్నప్పుడు చప్పున దేవుడు అతని మనసులో ఉద్భవిస్తాడు. ఆశ నశించనంత కాలం, అతని మనసులోని దేవుడు సజీవుడే!**

---

స్లేటుపుల్లలు అక్కడే పడిఉన్నాయి. బలపంమీద సగం చెరిగిన అక్షరాలు, కింద చాపమీద తల్లిఒడిలో నిద్రపోతున్న ఐదేళ్ల పాప కళ్లు కలల ప్రపంచంలోకి పారిపోయినట్టున్నాయి. పాప, నిద్రలో నవ్వుకుంటూంది కురులు ఆమె విశాలమైన కళ్లని కప్పేయి.

తల్లి ఇటునించి అటు ఒత్తిగిలి కుడిచేతికి బదులుగా ఎడమచేతిని తలగడగా చేసుకుంది. దారిద్ర్యపు యుద్ధంలో చిరుగులుపడి కుట్లుపడ్డ ఆమె ముతకచీర, యుద్ధంలో క్షతకాయుడయి, "మరింక బతకలేను, బతకలేను, చావు ప్రసాదించు దేవుడా!" అని మొరపెట్టుకొనే సైనికుడి దేహంలా ఉంది.

ఆ ముఖం ఒకప్పుడు ఎంతో అందమైన ముఖం. శరీరం వంపులుదేరిఉండే శరీరం అన్న నిజం ఆ నులక మంచంమీద కూలబడ్డ ఆమె భర్తకి, నరకంలోనో, స్వర్గంలోనో ఉన్న ఆమె తలిదండ్రులకి తెలిసిఉండచ్చునేమోకాని, ఐదేళ్ల క్రితం ఆమెని ఎరిగిఉన్న వాళ్లెవరూ "ఈమె ఆ అందం వదిలివెళ్లిన ప్రేతం" అని చెప్పినా నమ్మరు.

మరొక జీవిని ఈ దరిద్రంలోకి, ఈ దుఃఖంలోకి, ఈ నరకకూపంలోకి ఇంకొద్ది రోజులలో తెచ్చిపడేసి, ఆ జీవి కోరుకోని, ఆ జీవి కక్కరలేని ఒక జీవితకాలపు బ్రతుకుబరువుని, దుఃఖాన్ని, దాని బడబాగ్నిని అనుభవింపజేసే శిక్షాధికారిలా లేదా ముఖం. పరిపూర్ణత పొందిన మాతృత్వంతో తృప్తిగా ఉందామె ముఖం.

ఆమె ఒత్తిగిల్లగానే ఉప్పెనలా ముంచుకు వచ్చింది దగ్గు. దగ్గుతో ఆమెకు మెలకువవచ్చింది. ఆయాసపడుతూ లేచి కూర్చుంది. పదినిమిషాల వరకూ తగ్గలేదు దగ్గు. నరకంలో యమకింకరులు పాపులని రంపంతో కోసినట్టు ఆమెను నిలువునా కోసిం దది పదినిమిషాలు.

ఆమెను చూస్తూ కూర్చున్న అతడేమీ చలించలేదు. అన్నింటికీ అతీతుడైనవాడిలా, ఈ ప్రపంచంలో లేనివాడిలా, ఈ బాధలు బంధాలు,దుఃఖం అంటనివాడిలా దీపపు వెలుగులోకి చూస్తూ కూర్చున్నాడు.

చలించని అతడిని చూసి, ఆమె అంత బాధలోనూ నవ్వి, ప్రేమగా అడిగింది. "ఇంకా నిద్రపోలేదా? ఎందు కలా బెంగపెట్టుకుంటారు? అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు."

కాని అతడు ఏమీ అనకపోవడంతో నిట్టూర్చి, గోడవైపు తిరిగి పడుకుని కళ్లు మూసుకుంది.

ఆ గదిలో ఈ కొసనించి ఆకొసవరకూ యమపాశంలా వ్రేలాడే 'క్లాత్‌స్టేండ్'గా వాడబడే చేంతాడూ, దానికి వ్రేలాడే మాసిపోయిన పంట్లాలు, ప్రేగుల్లా వ్రేలాడే దారాలతో ఒక కమీజు, ఏనాటివో ఇంకా వాడబడుతున్న పాప గౌన్లు రెండు, చిరుగులు పడ్డ ఆమె రవిక ఒకటి, అతడికేసి అవహాస్యంగా చూసే అలనాడు కాలేజీ నాటకంలో వేసినాడు తీయించుకున్న హీరోపాత్ర ఫొటో, అన్నీ ... 'ఔను! అన్నింటికీ దేవుడే ఉన్నాడు అని మేం ఒప్పుకుంటున్నాం. అందుకే నీ దారిద్ర్యాన్ని అనుభవిస్తూ మేమూ, నీలానే పడిఉన్నాం!' అంటున్నట్టు, అప్పుడే కిటికీలోనుండి వీచిన రొజ్జగాలికి తలలాడించేయి.

ఆ చిన్న కిరసిన్‌దీపం చుట్టూ ఒక అందమైన, రంగురంగుల తూనీగ ఎగురుతూ, ఆనందంగా అంటూంది "తప్పకుండా ఉన్నాడు దేవుడు, నే నెంతో ఆనందంగా ఉన్నాను. ఆ బంగారుజ్యోతితో ఎంచక్కా ఆడుకొంటున్నాను!" అని.

అతడి పళ్లు బిగిసేయి. రెండుచేతులతోనూ తల గట్టిగా నొక్కుకొని అన్నాడు: "ఉంటే ఉన్నాడేమో... కాని వా డీ ప్రపంచంలో లేడు. మానవుడికి లేడు. దేవతలకోసం స్వర్గంలో ఉన్నాడేమో! రాక్షసులకి శత్రువుగా కనిపించచ్చేమో! కాని, వా డీ మానవప్రపంచానికి, మనిషికి లేడు! నేను మరో గడియకో, గంటకో చస్తాను నా భార్యాబిడ్డలతో సహా! అతడెక్కడున్నా ఉంటే, అక్కడ అతడి గుండెలు పగిలేలా అరుస్తాను. ఇలా అరుస్తూ 'మనిషిని పుట్టించి, నువ్వు పాపాత్ముడి వయ్యేవు!మనిషికి బతుకిచ్చి,బాధలిచ్చి,బీభత్సాన్ని కలిగించే మేధ ఇచ్చి, దరిద్రాన్నిచ్చి, కన్నీటినిచ్చి, ఏడ్పించి, అతడి బాధలు చూస్తూ, సాడిస్టులా నువ్వానందిస్తూ పాపాత్ముడివయ్యేవు నువ్వు!'అని అరుస్తాను,అరుస్తాను! దేహంలేని నా జీవాత్మలోనుండికూడా జీవుడు

---

## మంజుల

---

ఎగిరిపోయేలా అరుస్తాను. ఆ ఆక్రందనలో, ఆ ఘోషతో దేవుడనేవాడే ఉంటే వాడిని హతమారుస్తాను" అనుకున్నాడతను.

ఆమె నిద్రపోతూంది.

అతడి చూపులు ఆమె ముఖాన్ని ప్రేమగా తాకేయి. అతడనుకున్నాడు — ఈ బ్రతుకు నీలాటి నాజూకైన పుష్పానికి కాదు. వికసించి, రాత్రి గడిచి, తెల్లవారకమునుపే వాడిపోయేవు. రేకులు రాలిపోయేయి. పుప్పొడి గాలిలో ఎగిరిపోయింది. అస్థిపంజరంలా మూడిక మిగిలింది, ఇక్కడ ఒక పువ్వు కొద్దికాలంక్రిందట పరిమళించిందన్నందుకు సూచనగా.

ఆనాడు నిన్ను చూసేను, నేను సలీముగా, నిన్ను అనార్కలిగా. కోయిలకంఠంతో గానంచేస్తూ, రాయంచలా ఆడుతూ నాదగ్గరికి వచ్చేవు. ఎవరో దేవకన్య స్వర్గంనించి దిగివస్తూ, నాకు చేయూత ఇచ్చి, నన్ను తనతో రమ్మన్నట్టు అనుభూతిని పొందేను, నా చేతివ్రేళ్లని నువ్వు తాకినప్పుడు. నా మనసుని, ఆత్మని నీకు సమర్పించుకున్నాను ఆనాడు. నాటకం అయింది—తెరపడింది కాలేజీ ఆడిటోరియమ్‌లో కరతాళధ్వనులు మారుమోగేయి.

నన్ను నమ్ముకొని ఎంతగా మోసపోయేవు! ఈ మానవుణ్ణి భర్తగా స్వీకరించి సజీవంగా గోరీ కట్టుకున్నావు! ఒక్కకాన్పుతోఅనుభవించేదుర్భరదారిద్ర్యంతో దుఃఖంతో, ఆకలితో, పస్తులతో, నిస్సత్తువతో, పగటికలలతో, ఎప్పుడూ నిజంకాని, అయినా మరువలేని ఆశలతో నీ యౌవనం కర్పూరంలా హరించిపోగా క్షయరోగంతో, గర్భంలో మరొక శిశువుతో నువ్వు మిగిలేవు!

> **మూర్ఖుడు**
>
> **మూర్ఖుడు తన కోటుకు జరీ అంచులు కుట్టించుకోవచ్చు. అయితేనేం — అతను మాత్రం మూర్ఖుడే!**
>
> —[illegible]

అవును . . . డాక్టరన్నాడు . . . క్షయేమోనన్న అనుమానం అని. . కాకపోవచ్చుట. . . కావచ్చుట. . .

క్షయే రానక్కర్లేదు నీ బాధలకి . . . ఉన్న బాధలే క్షయకన్న ఎక్కువైనవి! . . . నీ ప్రాణాని కవి చాలు!

అతడు పాపని చూసేడు. అమాయకంగా నిద్రపోతున్న జీవి. నువ్వెందుకీ పాపాత్ముడి ఇంట పడ్డావు, తల్లీ! నీ జన్మకి కారణభూతుడైన నేను మహాపాపిని. ఈ పాపాన్నింటికీ ప్రాయశ్చిత్తంచేసుకుంటాను. మీకే దుఃఖాన్ని అంటనివ్వను . . . అంటనివ్వను. . . అనుభవించింది చాలు.

అతడి నేత్రాలు ఎర్రగా, నిటలాక్షుడి మూడో నేత్రంలా రౌద్రాకారం దాల్చేయి, గోడకి వేలాడే తన కాలేజీరోజులనాటి సలీముఫోటోని చూడగానే. . . ఆ రోజులలో తా నెవరు? తానొక తూనీగ. . . రెక్కలాడించుకుంటూ . . . ఈ దీపం చుటూ ఆనందంగా ఎగిరే తూనీగవంటి తూనీగ. . .




## పాదముల దురద చర్మము దురద

మీ చర్మము యొక్క దురద, మంట మీకు పూర్తిగా అశాంతి కలిగించుచున్నదా? మీ చర్మము పగిలి, రక్తము కారుచున్నదా? పాదముల వేళ్ళసందున పగుళ్ళు ఏర్పడినవా? ఇట్టి పగుళ్ళు అంకమూ బాధించుచున్నవా? ఇట్టి చర్మ వ్యాధులను కలిగించు క్రిమి నేర్పుగ నాటుకొనిలో వ్యవహరించ బడుచున్నది. మీ చర్మ వ్యాధులు పూర్తిగా తొలగుటకు అందుకు కారణభూతమైన క్రిమి సంపత్తిని నశింప చేయవలయును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సొడెర్మ్ (NIXODERM)తో మొదటి పూతకే దురదతగ్గి, క్రిముల నశించి చర్మము యథా ప్రకారముగా మృదువై శుభ్రపడును. నిక్సొడెర్మ్ (NIXODERM) జయప్రదముగా దురదను పోగొట్టి, కాళ్ళ పగుళ్ళ నయము చేయుటకు తోడ్పడి తడితడ గజ్జి, మొటిమలు, చీడ, కురుపులు, తామర మొదలగు శారీరక చర్మ వ్యాధులనుగూడ నయము చేయును. మీకు పూర్తిగా గుణమునిచ్చి, సంతృప్తి కలుగగల నిక్సొడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

నిర్విచారంగా . . . ఊహాలు ఆకాశాన్నంటగా . . . నేనే ఆ శిల్పుణ్ణి. . . నేనే సౌందర్యోపాసకుణ్ణి. . . మానవాళి సార్వభౌముణ్ణి ... కవిని ... గాయకుణ్ణి... సంగీతాన్ని... పూలలోని సుగంధాన్ని . . . జవ్వనిలోని లాలిత్యాన్ని, సిగ్గుని, అందాన్ని, నిప్పులోని వేడిని ... ఇంద్రధనుస్సులోని రంగులని, నదిలోని సిందుదనాన్ని . . . మృత్యువులోని శాంతిని.

ఆ నేను ఏమయేను?... ఆనాటి నే నెక్కడున్నాను? ఆ చిత్రంలోని మంటకుడేడీ? అతని చేతిని తనచేత బుచ్చుకున్న ఆ అప్సరస ఏదీ?

మనిషికీ, మనిషి జీవితానికీ, అతని ఆనందానికీ అతీత విలువక్కే ఈ వ్యాపారపు నాగరికతా ప్రపంచంలో, కళాకుడిలా భవనత్రాణకుల్య, డిగ్రీ పట్టుకొని, నాలుగు మెతుకుల కోసం నలిగి, పిప్పిగా మారి, ఆశలని, ఆశయాలని మరిచి, ఆకాశాన విహరించే ఊహాలని అక్కడే గాలిలోనే వదిలేసి, పిప్పిగానే మిగిలిపోయేను. దారిద్ర్యపుమంటలు చుట్టుముట్టేయి. నైరాశ్యపు పెనుగాలి ఆ మంటల్ని ఎక్కువచేసింది దినదినానికీ . . . జీవించడానికి బతకడంకాదు . . . బతకడానికి జీవించడం. . . బతకడానికి ఆహారం . . . ఆహారంకోసం ఈ శరీరాన్ని బతుకుని, ఆశల్ని, ఆశయాలని చాలని రుసుముకి అమ్ముకొని. . . ఎక్కడున్నావు నువ్వు ఫొటోలోని మంతరుడా? నువ్వు మరి లేవు! నేనూ మరి ఉండను!

నేను ఈ ప్రపంచాన్ని, ఈ జీవితాన్ని వాటి ఇనుప పాదాలకింద తొక్కనివ్వను నన్ను, నా భార్యని, నా పాపని. మేం ఇంక నలగం. నేనే ఈ జీవితాన్ని నా కాల రాస్తాను! దాన్ని పట్టునించి తప్పించుకొని, ఆ పరిధినించి బైటపడి, ఈ ప్రపంచాన్ని అప్పుడు అంతరిక్షంలోంచి చూసి వికటాట్టహాసం చేస్తాను! ఈ బొందిలో, ఈ మానవపంజరంలో చిక్కుకున్న నన్ను చూసి వికటాట్టహాసంచేసే ఇనపచక్రాల బ్రతుకుని తప్పించుకొని, నేను మళ్లీ ఒక తూరీగనైపోతాను. రెక్కలాడించుకుంటూ, నిర్విచారంగా నేను, నా భార్య నా పాప . . . దేహాలులేని అందరం ఒక్కటయిపోతాము. ఎంత మోసం! ఈ శరీరపుబందీలో, ఈ ఎముకల, రక్తమాంసపు బొందిలో చిక్కుకొని, దానికి బానిసయి జీవితాంతం గడపడం ఎంత మోసం!

దీపంచుట్టూ ఎగురుతూ ఆ తూరీగ ఎంత స్వేచ్ఛగా, ఆనందంగా, అందంగా ఉంది!

అతడు శాపగ్రస్తుడిలా లేచేడు. అతడు నాసికా పుటాలు ఎగిరిపడుతున్నాయి. అతడి కన్నులు నిశ్చలంగా, నిశ్చయపూరితంగా జ్యోతులలా మెరుస్తున్నాయి.

అనుకున్నట్టుగా . . . అతడి చెయ్యి చీలికవాలికలైన పరుపుకిందకి వెళ్లింది. దానికిందినించి, తను నాటకాలు వేసేకాలంలో ఉపయోగించే కైజారు తీసేడు. ఆ కైజారు పైకెత్తి దీపపుకాంతిలో దాని వాడిఅంచులు వికారమైన సంతృప్తితో చూసేడు.

ముందు విముక్తి ఆమెకు . . . ఆనక పాప ... ఆనక తను . . . ముగ్గురు . . . మూడు జీవులు ... ఈ బొంది వదిలి ... ఏమీ బాధ ఉండదమ్మా. . . ఒకే ఒక్క క్షణంలో మనం అందరం ఈ ప్రపంచం నించి, ఈ మానవపంజరంనించి స్వేచ్ఛగా, ఆనందంగా ఒకటయి ఎగిరిపోతాం!...ఆ తూరీగలా ... స్వేచ్ఛగా . . .

సతి మరణించినప్పుడు మూడోకన్ను విప్పి నృత్యంచేసే శివుడిలా అతడు వారిని సమీపించి కైజారు ఎత్తేడు.

ఒక్కసారిగా గదంతా చీకట్లు కమ్ముకున్నాయి.
అతడు త్రిగ్గాంతుడయి ఉండిపోయేడు!
దీపం ఆరిపోయింది.

అతడి ఒళ్లంతా చెమటలుపట్టేయి. చేతిలోని కైజారు జారి కిందపడింది.
గదంతా చీకటి. ఏమీ అగుపడటంలేదు.
ఎందుగన్నిమంటలా ఆవేశం, నిశ్చయం ఒక్కసారి మంచి, చల్లారి, ఒళ్లంతా చలితో కంపిస్తోంది.
అతడు వణుకుతూ వెళ్లి, ఆరిపోయిన దీపం ప్రక్కనే ఉన్న అగ్గిపెట్టెని అందుకొని, ఒక పుల్ల వెలిగించి, దీపం వెలిగించేడు.
అగ్గిపుల్ల అతడి వేలినించి జారి కిందపడింది.
అతడి కళ్లు మంత్రముగ్ధాలలా ముందుకి చూస్తూ ఉండిపోయేయి.

ఎంతో ఆనందంగా దేవుడున్నాడని నిర్విచారంగా ఎగిరిన రంగురంగుల, అందమైన తూరీగ జీవం పోగొట్టుకొని పడిఉంది. అందులోని జీవుడు లేడు. చలనరహితమైన దేహంమాత్రం పడిఉంది . . .
అతడి మెదడుని మెరుపు తాకినట్టయింది. 'ఎంత అందం...ఎంత ఆనందం ... ఎంత స్వేచ్ఛ ... ఎంత ఔన్నత్యం ... ఎంత దేవత్వం పోయేయి!'

కదలకుండా పడుంది బతకాలనుకున్న ఆ జీవి. . . ఇప్పుడేముంది అందులో. . . జీవం ఉన్నప్పుడు ఎంత స్వేచ్ఛగా . . . ఎంత అందంగా!...
చావుబతుకులు నా చేతిలో ఉన్నాయి. . . బతకాలనిఉంటే బతకగలను.చావాలని ఉంటే చావగలను. ఏ క్షణమన్నా ఎగిరిపోగలను . . . ఆ స్వేచ్ఛ నా కెప్పుడూ ఉంది! బతకడానికి స్వేచ్ఛ ఉంది. . . చావడానికి స్వేచ్ఛ ఉంది ... దేవుడు మానవుడికిచ్చిన ఎవరికీ ఇవ్వని అపూర్వమైన వరం. . . ఆ స్వేచ్ఛ ... ఎంత స్వేచ్ఛ ప్రసాదించేవు భగవాన్! ఈ బాధలు, ఈ బతుకులోని సంకెళ్లు, ఈ సంకుచితత్వం ... ఈ దారిద్ర్యం ... నా జీవితంమీద నా కుండే స్వేచ్ఛ ముందు. . . ఆ స్వేచ్ఛ శక్తిముందు ఏపాటి! అవి పటాపంచలయిపోతాయి. . .
అతడి కళ్లు నక్షత్రాలలా మెరిసేయి ... అతడి ముఖాన అనిర్వచనీయమైన శాంతి ద్యోతకమయింది.

ఆమె నిద్రలో ఒత్తిగిల్లుతూ, దగ్గు కమ్ముకురాగా తెరతెరలుగా దగ్గుతూ లేచి కూర్చుని దగ్గుతూనే అంది, "ఇంకా పడుకోలేదా? . . . ఎందుకు బెంగ పెట్టుకుంటారు? అన్నింటికీ ఆ దేవుడేఉన్నాడు!" అని.

అతడు ఆవేశంలో కారే కన్నీటితో ఆమెను పొదివి పట్టుకొని అన్నాడు పారవశ్యంతో "దేవుడు తప్పకుండా ఉన్నాడు!" అని.